క్లుప్తంగా

ధర్నా జయప్రదం చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో నిర్వహించే మహాధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని వామపక్ష, రైతు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వామపక్ష, కార్మిక, రైతు సంఘాల నేతలు మనోహర్, నాగ సుబ్బారెడ్డి, దస్తగిరిరెడ్డి, సుబ్బారెడ్డి , రాము శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా చదివితే ఉన్నత శిఖరాలు

కడప స్పోర్ట్స్: విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా చదవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణురాలు డా. లలిత సూచించారు. బుధవారం కడప నగరంలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో స్టెప్ ఆధ్వర్యంలో 'వ్యక్తిత్వ వికాసం-కెరీర్ గైడెన్స్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెక్నాలజీని మంచికి ఉపయోగించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. నాగరాజు, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : ప్రజల ఆరోగ్యాలకు హానికరంగా ఉన్న ఉక్కాయపల్లి డంపింగ్ యార్డ్‌ను వెంటనే ఇతర ప్రాంతానికి తరలించాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య నగర కార్యదర్శి ఓబులేసు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గతంలో ఉన్న ఉక్కాయపల్లి డంపింగ్ యాడ్‌ను అభివృద్ధి పేరుతో పార్కును ఏర్పాటు చేశారన్నారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే పక్కనే మళ్లీ డంపింగ్ యార్డును పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఇది ప్రజలకు ఇబ్బందిగా ఉందన్నారు. అనంతరం ఓబులేశు డీవైఎఫ్ఐ నాయకులు యూసఫ్ లతో కలిసి ఇంచార్జ్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీ శివ శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఆయుధ శిక్షణ ఎంతో కీలకం



ఆయుధ వినియోగంలో శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ కేడెట్స్

కడప స్పోర్ట్స్: ఆయుధ శిక్షణ ఎంతో కీలకమైనదని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా పేర్కొన్నారు. కడప నగరం ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న కంబైన్డ్ అన్యువల్ ట్రెనింగ్ క్యాంపులో భాగంగా బుధవారం ఎన్‌సీసీ కేడెట్స్‌కు ఆయుధ వినియోగం, ఆయుధాల విడిభాగాలను జోడించడం, విడదీయడం వంటి అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఎస్.ఆర్. రైఫిల్ విడి భాగాలను జోడించడం, విడదీయడంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్యాంపు డిప్యూటీ కమాండెంట్ డా. ఆర్. నీలయ్య, డా. మహేష్, పరేడ్ శిక్షకులు సుబేదార్ అశోక్, బిష్నోయ్, సీఎల్ రెడ్డి, జగదీష్, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

కడప అగ్రికల్చర్: కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్రంలో ఈ నెల 24, 25 తేదీలలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఆసక్తి కలిగిన యువత 24వ తేదీలోగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 9848809236 నెంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాలి



ఆశాల శిక్షణా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఇన్‌ఛార్జ్ డీఎంహెచ్ఓ ఉమామహేశ్వరకుమార్

కడప రూరల్: విధి నిర్వహణలో భాగంగా ఆశాలకు ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించాలని ఇన్‌ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ అన్నారు. బుధవారం స్థానిక మల్టీ పర్పస్ సోషల్ సర్వీస్ సొసైటీలో నూతనంగా చేరిన ఆశాలకు ఆరోగ్య అంశాలు, పథకాలపై 13 రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలు తమ విధి నిర్వహణలో భాగంగా మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు, తదితర అంశాలకు సంబంధించిన వాటిపై అవగాహన కల్పించాలన్నారు. తద్వారా ప్రజల ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డెమో భారతి, రూతమ్మ, ఎన్‌వీ కుమారి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డులో విద్యుత్ స్తంభాలు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని తిలక్ నగర్ నుంచి మాచుపల్లి రోడ్డు వరకూ ఇటీవల కొత్త సిమెంటు రోడ్డు నిర్మించారు. అయితే ఇటు నగరపాలక సంస్థ, అటు విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం స్థానిక ప్రజలకు శాపంగా మారింది. సిమెంటు రోడ్డు పూర్తయ్యే సరికి రెండు విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలోకి వచ్చాయి. నడిరోడ్డులో స్తంభాలు ఉండటం వల్ల వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారింది. ఏవైనా వాహనాలు స్తంభాలను ఢీ కొడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నాలుగైదు నెలలుగా ఈ సమస్య ఉంది. అలాగే ఇక్కడ కొన్ని విద్యుత్ స్తంభాలు చాలా తక్కువ ఎత్తులో ఉన్నాయి. కొన్ని ఒరిగిపోయి ఉన్నాయి. వీటిని తొలగించి కొత్త స్తంభాలు వేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నా కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి సమస్య పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.





తిలక్ నగర్‌లో రోడ్డు మధ్యలో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకుందాం



మాట్లాడుతున్న సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజనేయులరెడ్డి

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించి ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ సభ్యుడు, యువ నాయకులు నరేన్ రామాంజనేయులురెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని బలిసింగాయపల్లిలో ఆయన జగనన్న ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం సచివాలయం లో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల సూచిక బోర్డులను గ్రామపంచాయతీ సర్పంచ్ పి. ఈశ్వరమ్మ తో కలిసి ప్రారంభించారు, కార్యక్రమంలో ఎంపీటీసీ రఘురాం రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, వైఎస్సార్సీపి మహిళ నాయకురాలు భాగ్యమ్మ, లేవాకు ఈశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎస్ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, పార్టీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, నిరంజన్ రెడ్డి, , సొసైటీ అధ్యక్షులు, సాదిక్ అలీ, వారిష్, హస్రత్, సాదు కిషోర్, సిద్ధవటం హరి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె: మండలంలోని అలిదెన గ్రామంలో మండల అధ్యక్షుడు రఘునాధరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీకి జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వరాయ సాగర్ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకంద్వారా అలిదెన చెరువుకు నీటిని తరలించనున్నట్లు చెప్పారు. దీంతో అలిదెన గ్రామంతో పాటు ఈర్లపల్లె, ఓబాయపల్లె గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలియజేశారు.. అనంతరం సంక్షేమపథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచు వాసుదేవరెడ్డి, గోనుమాకులపల్లె సహకార సంఘం సీఈఓ దేశాయ్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు బాస్కర్ రెడ్డి, స్థానిక నాయకులు ఉత్తమారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవ..ప్రభుత్వ బాధ్యత

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



చిన్నచెప్పలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: ప్రజా సేవ.. ప్రభుత్వ బాధ్యత అని, చిత్త శుద్ధితో ప్రజా సేవకే అంకితమైన జగనన్నను తిరిగి సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం చిన్నచెప్పలి సచివాలయంలో నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలి? కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముందుగా సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయం పరిధిలో రూ. 25 కోట్లు ప్రజలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా చేరిందన్నారు. రూ. 4కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. దీనికి కారణం జగనన్నేనని స్పష్టం చేశారు. చంద్రబాబు వేల హామీలిచ్చి పాలన గాలికొదిలేశారని తూర్పారబట్టారు. జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే అరకొర ప్రభుత్వ పథకాలు వచ్చేవన్నారు. ప్రస్తుతం జగనన్న పాలనలో అర్హత ఉంటే చాలని, వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికి చేరుతాయన్నారు. ప్రజా సేవే ప్రభుత్వ బాధ్యత అని నమ్మిన సీఎం జగనన్నను మరో సారి సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రాజుపాళెం సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్‌సీ పుల్లారెడ్డి, ఎంపీటీసీ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీపీ గండి భాస్కర్, వైస్ ఎంపీపీ చెన్నకేశవ రెడ్డి, సర్పంచులు బుజ్జన్న, రాజారెడ్డి, స్థానిక నేతలు పుల్లారెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

పెండ్లిమర్రి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఆయన మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డిలు అన్నారు. గంగనపల్లె గ్రామ సచివాలయంలో బుధవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు.మానమ్మకం నువ్వే జగనన్న జెండాను ఎగవేశారు.ఈకార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, పాలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, మాజీ పాలతల చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి,సర్పంచ్ సురేఖ, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి,ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పథకాల అమలులో దేశంలోనే రాష్ట్రం ఆదర్శం

వల్లూరు: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే మన రాష్ట్రం ఆదర్శవంతంగా నిలుస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తప్పెట్ల సచివాలయం ఆవరణలో బుధవారం జరిగిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరికీ పార్టీలతో, వర్గాలతో సంబంధం లేకుండా పారదర్శకంగా అందిస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మనసున్న మారాజుగా, ప్రజల మనిషిగా నిలిచారని అన్నారు. టీడీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు, కరువు కవల పిల్లలని, చంద్రబాబు సీఎంగా వున్న పద్నాలుగున్నర సంవత్సరాల్లో 13 సంవత్సరాలు కరువు విలయ తాండవం చేయగా ఒకటిన్నర సంవత్సరం వరదలతో నష్టాలు సంభవించాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జెడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు రామ చంద్రారెడ్డి, పార్టీ నేతలు రఘునాథరెడ్డి, శంకర్‌రెడ్డి, శివకుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డి, వెంకట్రామిరెడ్డి, బాల మైసూరారెడ్డి, రాజారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, సుబ్బిరెడ్డి, వీరారెడ్డి, శంకర్, ముకుందారెడ్డి, ఎంపీడీవో జయశ్రీ, ఈవోపీఆర్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.

వంకలో పూడిక తీత

కమలాపురం: మండలంలోని చిన్నచెప్పలిలో ఉన్న గాడిదల వంకలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి సొంత నిధులతో పూడికతీత పనులు జరుగుతున్నాయి. పాలగిరి వంక నుంచి గాడిదల వంక ద్వారా కట్టుకొమ్మ కాల్వకు వరద నీరు వచ్చేవి. అయితే 30 ఏళ్ల నుంచి ఆ వంకలో పూడిక తీయనందున వంకకు వరద వచ్చిన సమయంలో నీరంతా ఇళ్లలోకి వస్తున్నాయని గ్రామస్తులు ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.4 లక్షల సొంత నిధులతో గాడిదల వంకలో పూడికతీత పనులు చేపట్టారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పార్కుల్లో పచ్చదనం తగ్గకుండా చర్యలు



పాలెంపల్లిలో వార్డు సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: నగరంలోని రాజీవ్ పార్కు, వైఎస్ విజయమ్మ పార్కుల్లో పచ్చదనం తగ్గకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ జివిఎస్ ప్రవీణ్ చంద్ అన్నారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఏపీహెచ్బీ కాలనీ, రాజీవ్ పార్క్ , వైఎస్ విజయమ్మ పార్క్, పాలెంపల్లి ప్రాంతాలను పరిశీలించారు. ఏపీహెచ్బీ కాలనీలో అటెండెన్స్ నందు హాజరైన పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యూనిఫామ్ ధరించాలని, పనిచేయునప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్లాప్ వాహనాలు ప్రతిరోజు మూడు ట్రిప్పులు తప్పనిసరిగా తిరిగేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్క ట్రిప్పులో చెత్త టన్నుకు తగ్గకుండా చూసుకోవాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ వందశాతం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజీవ్ పార్కులో ఆట పరికరాలు ఉపయోగంలో ఉండేలా మరమ్మతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 20, 50వ డివిజన్ల ఇన్‌చార్జులు శ్రీరంజన్‌రెడ్డి, కె. రాజశేఖర్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ రవీందర్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరిస్తాం

కమలాపురం: తప్పులు లేని ఓటరు జాబితా తయారీలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఇస్తున్న ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని కమలాపురం నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రమోహన్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ సమ్మరి రివిజన్ పై రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఎన్నికల కోసం తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేస్తామన్నారు. అందుకు అన్ని రాజకీయ పార్టీల సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ఎన్‌సీ పుల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శంకర్ యాదవ్, అన్ని మండలాల తహసీల్దార్లు సరస్వతి, శంకరయ్య, ఉదయ భాస్కర్ రాజు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌ను వినియోగించుకోవాలి



కార్మికులకు కార్డులను అందచేస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం కార్మికుల కోసం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ బీమాను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ది కడప ప్రైవేటు టు వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మహబూబ్‌బాషా తెలిపారు. బుధవారం కడప మట్టిపెద్దపులి వద్ద ది కడప ప్రైవేటు టు వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో 50 మంది మెకానిక్‌లకు కార్డులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రతి ఒక్కరికి ఐదు లక్షలతో కూడిన బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు లయన్ పటాన్ ఖాదర్ బాష, సహాయ కార్యదర్శి అన్వర్‌బాష, సుబ్బరాయుడు, అక్బర్ ఖదీర్, మహమ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వల్లూరు ఎంపీడీవోగా జయశ్రీ

వల్లూరు: వల్లూరు ఎంపీడీవోగాపీ జయశ్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రూప్ -1లో ఎంపీడీవోగా ఎంపికై న ఆమెను మొదటి సారిగా వల్లూరు ఎంపీడీవోగా నియమించారు. ఈ మేరకు ఆమె స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



కడప కల్చరల్ : కడప నగరం పాలెంపల్లెలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయ 8వ వార్షిక గ్రామోత్సవాన్ని బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం శ్రీ అయ్యప్పస్వామి, గణపతిలకు ఆలయ ప్రాంగణంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద పెద్ద ఎత్తున హాజరైన అయ్యప్ప భక్తుల మధ్య గురుస్వామి ఆధ్వర్యంలో కలశ పూజ నిర్వహించారు. రాత్రి ప్రత్యేక రథంపై అయ్యప్పస్వామిని కనుల పండువగా అలంకరించి కొలువుదీర్చారు. విశేష పూజలనంతరం స్వామిని గ్రామోత్సవానికి తరలించారు. కేరళ బ్యాండు మేళాలు, విచిత్ర వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నేత్ర సంరక్షణకు ప్రాధాన్యత

– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : వీక్షణ శక్తి జీవితకాలం ప్రభావవంతంగా ఉండాలంటే నేత్ర సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎస్.పి. వెంకటరమణ ఆధ్వర్యంలో కడప భారతి కంటి ఆసుపత్రి సహకారంతో «ఐ స్క్రీనింగ్ టెస్ట్, అవేర్‌నెస్ హెల్త్‌క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ «సర్వేంద్రియానాం నయనం ప్రధానం» అని పేర్కొంటూ నేత్ర సంరక్షణ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ నేత్రాల సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహణకు ముందుకు వచ్చిన భారతి వైద్యశాల బృందాన్ని, వైద్యులను అభినందించారు. భారతి నేత్ర వైద్యశాల వ్యవస్థాపకులు డా. స్వరూపరాణి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కంటి సమస్యలు, సంరక్షణ విధానాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. వెంకట్రామిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు డా. సునీత, డా. శ్రీనివాసరావు, డా. టి. చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిజిటల్ అక్షరాస్యత చాలా అవసరం

వైవీయూ : డిజిటల్ ప్రపంచంలో సాంకేతికతపై అవగాహన.. నైపుణ్యత పెంచుకోవడం తక్షణ అవసరమని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అన్నారు. బుధవారం వైవీయూలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో 'ప్రస్తుత కాలంలో డిజిటల్ అక్షరాస్యత ప్రాముఖ్యత', హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల నుంచి మహానగరాల వరకు వ్యాపార కలాపాలు ఆన్‌లైన్‌లో జరుగుతున్నాయన్నారు. రీసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన హర్షక్-నాస్కామ్ ఫౌండేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్. నాగేశ్వరరావు మాట్లాడుతూ డిజిటలైజేషన్ ప్రయోజనాలను వివరించారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ హెచ్ఐవీ పుట్టుక, వ్యాధి వ్యాప్తి, యువత – విలువల జీవన విధానం గురించి అవగాహన కల్పించారు. అనంతరం రీసోర్స్ పర్సన్‌లు వీసీ ఆచార్య చింతా సుధాకర్‌ను కలిశారు.

ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య, కెరీర్ గైడెన్స్ సెల్ డైరెక్టర్ డా. లాజరస్, మైనార్టీ సెల్ డైరెక్టర్ డా రియాజున్నీసా, ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ప్రోగ్రాం ఆఫీసర్ సునీత, లలిత పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి



భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆప్కాబ్ చైర్ పర్సన్ ఝాన్సీరాణి, ఎండీ శ్రీనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి: రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీ రాణీ, అప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెల్లటూరు సొసైటీ పరిధిలో రూ.36 లక్షలతో నూతనంగా నిర్మించిన గొడౌన్‌ను ప్రారంభించారు. పెండ్లిమర్రిలో రూ.54.50 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సొసైటీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడి ఉన్న సహకార రంగాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బలోపేతం చేశారన్నారు. సహకార బ్యాంక్‌ల ద్వారా గ్రామీణ ప్రాంతా ల్లో ఉన్న రైతులకు వ్యవసాయ, గృహరుణాలతో పాటు విద్యార్థులు విదేశాలల్లో చదువు కోసం విద్యారుణాలు కూడా ఇస్తాన్నామన్నారు.కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రా రెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి,ఎంపీటీసీ క్రిష్ణయ్య, స్థలదాత నాగమల్లారెడ్డి పాల్గొన్నారు.

వితరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం పాత రిమ్స్‌లోగల అల్ షిఫా మానసిక వృద్ధుల ఆశ్రమానికి కెనరా బ్యాంకు అధికారులు వాటర్ ప్యూరిఫైడ్ యంత్రం, మిక్సీ గ్రైండర్, సీలింగ్ ఫ్యాన్లు, బియ్యం ప్యాకెట్లను బుధవారం వితరణగా అందజేశారు. కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్, డివిజనల్ మేనేజర్ ఏవీ రాజశేఖర్, మేనేజర్ ఓబులేశు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంక్రిమెంటు కొందరికే ఇవ్వడం దారుణం



ఏపీజీబీ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కంప్యూటర్ ఇంక్రిమెంటును కేవలం కొంతమందికి మాత్రమే రిలీజ్ చేయడం దారుణమని ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ జి.శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా బుధవారం విశ్రాంత ఉద్యోగులు బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జి.శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ 2018 వరకు సర్వీసులో ఉన్న వారికి మాత్రమే కంప్యూటర్ ఇంక్రిమెంట్లు రిలీజ్ చేశారని, అంతకుముందు రిటైర్డ్ అయిన వారికి మొండి చేయి చూపారన్నారు. ఇది దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగ సంఘ జిల్లా నాయకులు పద్మాకర్‌రెడ్డి, శ్రీరామమూర్తి, వీరారెడ్డి, వెంకట్రామిరెడ్డి, కేఎల్ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు లిస్టులో మృతుల పేర్లు తొలగించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని బూత్ నెంబరు 167, 169, 170, 176, 180లకు సంబంధించి ఓటరు లిస్టులో మృతి చెందిన వారి పేర్లు ఉన్నాయని, ఆయా పేర్లను తొలగించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి జి.లక్ష్మణ్‌రావు కోరారు. బుధవారం ఆర్డీఓ మధుసూదన్‌కు ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా పలు పీఎస్ నెంబర్లలో మృతుల పేర్లు, డబల్ ఎంట్రీలు ఉన్నాయని, వీటిపై విచారించి తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

బస్సు యాత్ర విజయవంతం చేయాలి



అఫ్జల్ ఖాన్

కడప కార్పొరేషన్: కడప నగరంలో గురువారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్ ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ పిలుపునిచ్చారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యం కల్పించారన్నారు. రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించి, కీలక పదవులన్నీ వారికే ఇచ్చారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. ఈ విషయాలను ప్రజలకు తెలియజేయడానికే సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు.

పంచనదీ హారతికి ఉచిత బస్సు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఆశారేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి క్షేత్రంలో నిర్వహించనున్న పంచనదీ హారతి కార్యక్రమానికి ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని సంస్థ చైర్ పర్సన్ నెమలిదిన్నె నాగవేణి తెలిపారు. ఎస్పీ బంగ్లా వద్ద గల ఏపీ టూరిజం హరిత హోటల్ వద్ద నుంచి 26న సాయంత్రం ఉచిత బస్సు బయలుదేరుతుందన్నారు. ఆసక్తిగల వారు 24వ తేదీ సాయంత్రం 4.00 గంటల్లోగా 88977 72024 నెంబరులో పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. దీపాలను వెలిగించదలచుకున్న వారు సామాగ్రిని వారే తెచ్చుకోవాలన్నారు.

తొలగిన ట్రాన్స్‌ఫార్మర్ కష్టాలు

కమలాపురం: కమలాపురం పట్టణంలో నగర పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న ట్విన్ ట్రాన్స్‌ఫర్మర్ల సమస్య ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి చొరవతో తొలగింది.పెద్ద దర్గా వెనుక, రామ్‌నగర్‌కు వెళ్లే మలుపులో ఉన్న ట్విన్ ట్రాన్స్‌ఫార్మర్లతో చాలా ఇబ్బందిగా ఉండేది. వాహనాలు తగలడంతో మంటలు చెలరేగి విద్యుత్ ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణం ఈ ట్విన్ ట్రాన్స్‌ఫర్మర్లను షిఫ్ట్ చేయాలని ట్రాన్స్ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం కాంట్రాక్టర్ ఆర్‌వీఎస్ఆర్, ట్రాన్స్‌కో ఏఈ చాంద్ బాషా ఆధ్వర్యంలో సిబ్బంది క్రేన్ సాయంతో ట్విన్ ట్రాన్స్‌ఫార్మర్లను మరో చోటికి తరలించారు. దీంతో పట్టణ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా లక్కోజు జయంతి

ప్రొద్దుటూరు : మండలంలోని కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం గణిత బ్రహ్మ లక్కోజు సంజీవరాయశర్మ జయంతిని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సురేష్, మాజీ సర్పంచ్, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ వల్లూరు నాగేంద్రా రెడ్డి, లక్కోజు సంజీవరాయశర్మ కుమారుడు లక్కోజు సుబ్బరాయుడు తదితరులు లక్కోజు విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లక్కోజు సుబ్బరాయుడు మాట్లాడుతూ కల్లూరులో సంజీవరాయశర్మ విగ్రహాన్ని ప్రతిష్టించి ఆయన పేరు మీద ప్రతి ఏడాది కార్యక్రమాలను నిర్వహిస్తున్న నాగేంద్రా రెడ్డికి, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.